


తెలంగాణ
# శాసనసభ
తెలుగు దినపత్రిక
## జిల్లా అనుబంధం
|| గురువారం 21 నవంబర్ - 2024 || పేజీలు : 4

# గురు నానక్ విశ్వవిద్యాలయం లో ఇండియా డిఫెన్స్, స్పేస్ కన్వెన్షన్ 2024 అనే అంశంపైన
# || జాతీయ స్థాయి సదస్సు ||






**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 20 :** ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్, గురు నానక్ యూనివర్సిటీ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో భారత రత్న డాక్టర్ అబ్దుల్ కలం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ యూత్ వారి సౌజన్యంతో భారత దేశంలోని యువతకు డిఫెన్స్, స్పేస్ రంగాలలో మంచి అవకాశాలు మరియు ప్రేరణ కలిగించేందుకు "ఇన్స్పైర్ ఇండియా డిఫెన్స్, స్పేస్ కన్వెన్షన్ 2024 " అనే ప్రముఖ కార్యక్రమాన్ని బుధవారం క్యాంపస్ లో నిర్వహించడం జరిగింది. ఈ విశిష్ట సదస్సు లో భారతదేశం, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ డిఫెన్స్, స్పేస్ రంగాలలో నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం యువతలో దేశభక్తి, నైపుణ్యం శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి పలు ముఖ్యమైన విషయాలపై చర్చలు, వర్క్‌షాప్ సెమినార్లు నిర్వహించి వారిని భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా తీర్చి దిద్ది దేశానికి ఉపయోగ పడే పరిశోధనలు చేసే దిశగా యువతలో శాస్త్ర, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ వంటి విభాగాలలో భవిష్యత్తు నాయకులుగా ఎదగడానికి కావాల్సిన సామర్థ్యాలు విద్యా అవకాశాలను అందించడమే కార్యక్రమ లక్ష్యం. ముఖ్య అతిథిగా డాక్టర్ జి సతీష్ రెడ్డి , ప్రెసిడెంట్ ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, మాజీ చైర్మన్ డి ఆర్ డి ఓ, ప్రస్తుత భారత రక్షణ శాఖకు సైంటిఫిక్ అడ్వైసర్ విచ్చేసి యువతకు సాంకేతిక పరిజ్ఞానం పరిశోధనలు వాటి అవసరాలు విద్యార్థులు అలవం-చ్చుకునే విధి విధానాల గురుంచి మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియా, భారత రత్న డాక్టర్ అబ్దుల్ కలామ్ జీవితగాథలు వారి ప్రేరణ గురుంచి వివరిస్తూ భారతదేశంలోని సాంకేతికత పరిశోధనా పథకాలు, యువతకు శక్తివంతమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగ పడతాయని ఇలాంటి సదస్సులను ఏర్పాటు చేస్తూ విద్యార్థులలో డిఫెన్స్ మరియు స్పేస్ రంగాలలో అభిరుచిని పెంచే ప్రయత్నం చేస్తున్న విద్యాలయాల యాజమాన్యాన్ని అయన అభినందించారు. ముఖ్య అతిథుల సమక్షంలో విద్యాసంస్థల విశిష్ట సిబ్బందిని సత్కరించడం జరిగింది . కార్యక్రమంలో గౌరవ అతిథులుగా రాజాసింగ్ తంగదురై, ప్రోగ్రాము డైరెక్టర్ పిజె -10 బ్రహ్మోస్, డి ఆర్ డి ఎల్, డాక్టర్ అశోక్ కుమార్ పాండే, హెచ్ ఓ డి ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఐ ఐ టి హైదరాబాద్, శ్రీ కే శ్రీనివాస రాజు, సి ఈ ఓ యూనిస్ట్రింగ్ టెక్ సోలుషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ , శ్రీ జి శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ , ఎర్త్ క్లైమేట్ సైన్స్ ఏరియా, ఆర్ ఎస్ సి - ఇస్రో హైదరాబాద్ , శ్రీ ఏం ఏ ఫాయిూజ్, గ్రూప్ డైరెక్టర్, ట్రైనింగ్ ఎడ్యుకేషన్ యెన్ ఆర్ ఎస్ సి - ఇస్రో , డాక్టర్ ఆర్ శ్రీనివాస్, హెడ్ స్టూడెంట్ అండ్ పబ్లిక్ ఔట్రీచ్ డివిజన్ యెన్ ఆర్ ఎస్ సి - ఇస్రో హైదరాబాద్, శ్రీ నరేష్ ఇండియన్, ఫౌండరర్స్, ఈఓ - డాక్టర్ అబ్దుల్ కలం ఇన్స్టిట్యూట్ట్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆఫ్ యూత్, లు పాల్గొని వారి విలువైన సందేశాలను అనుభవపూర్వకంగా విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ మరియు గురు నానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ ఐన సర్దార్ గగన్ దీప్ సింగ్ కోహ్లీ పాల్గొని తమ విజ్ఞాపనను మన్నించి ఇంతగొప్ప కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన అతిరథ మహారథులైన శాస్త్రవేత్తలను సన్మానించి జ్ఞాపికలను అందచేసి వారికి ధన్యవాదాలు తెలియచేస్తూ విద్యార్థులను మరియు సిబ్బందిని ఉద్దేశిస్తూ మాట్లాడుతూ భారతదేశంలోని యువత, విద్యార్థులు, యువ శాస్త్రవేత్తలు, డిఫెన్స్ అండ్ స్పేస్ రంగ నిపుణులకు ప్రేరణ మరియు ఉత్సాహం కలిగించే ఓ ప్రత్యేక అవకాశంగా ఈ కార్యక్రమం మారుతుందని అయన ఆశాభావం వ్యక్తం చేసారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మరియు గురు నానక్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ ఎస్ సైని మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మకమైన సదస్సు ద్వారా భారతదేశంలో డిఫెన్స్ మరియు స్పేస్ రంగాలకు సంబంధించిన యువతకు ఉన్నతమైన అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా యువతను ప్రేరేపితం చేసే చక్కటి వేదికగా అయన అభివర్ణిస్తూ డాక్టర్ అబ్దుల్ కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సెన్స్ సంస్థవారు యువతకు విజ్ఞాన, సృజనాత్మకత, మరియు నాయకత్వ నైపుణ్యాలు అభివృద్ధి చేయడానికి వారి సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు, యువతలో దేశాభిమానం, ఆత్మవిశ్వాసం మరియు శాస్త్రీయ దృక్పథం పెంపొందించే ప్రయత్నం చేస్తున్నందుకు వారిని అభినందిస్తూ తమ సహకారాన్ని అందిస్తామని తెలియ చేసారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్ శ్రీనాథ రెడ్డి , డాక్టర్ సంజీవ్ శ్రీవాస్తవ, జాయింట్ డైరెక్టర్ %ఌ% ఈవెంట్ కన్వీనర్ డాక్టర్ పి పార్థసారథి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకట రావు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు తాడిశెట్టి, డాక్టర్ రిషి సయాల్, డాక్టర్ రంగ నాయకులు, మరియు ఇతర విభాగ అధిపతులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



# స్ఫూర్తి

## స్వేచ్ఛ

జెండా స్వేచ్ఛ గా రెపరెపలాడు
కానీ పాతిన గుంజను దాటదు
పెంపుడు కుక్క స్వేచ్ఛ గా తిరుగు
కానీ మెడలోని గొలుసు బంధించు
గాలిపటం స్వేచ్ఛకు మారుపేరు
కానీ దారమే ఆధారమే నిలుచు

కోకిల కంఠం స్వేచ్ఛకీ ప్రతిరూపం
కాకుల గుంపులో కోకిల స్వరం పెగలదు
నిజం చెవికెక్కించుకొని అధికార దర్పం
గొంతునొక్కుతారనీ కోకిలకీ భయం

దీపాల వెలుగు స్వేచ్ఛకీ ప్రతీక
తనను తాను వెలిగించుకున్న
దీపంను ఆర్పడం ఎంత పాపం
పిచ్చిగానీ దీపాలు ఆరితే చీకటి చేరదు
వేల వేల దీపాలు అక్కడక్కడ నిత్యం
అక్షయలా రగులుతున్నప్పుడు
రేపటి ఉషోదయంను ఏ చేతులు ఆర్పగలవు

జెండా బీ పెంపుడు కుక్క బీ గాలిపటం
కోకిల స్వరం బీ దీపాల వెలుగు
ముసురుతున్న మానవత్వాన్ని తట్టి
నిద్ర లేపే చైతన్య వారధులు

డా.ఐ.చిదానందం
చరవాణి - 8801444335

# ఏసీబీకి పట్టుబడిన ఇద్దరు ఎస్ఎఫ్ఏలు


3లో

# మృతుని కుటుంబానికి చేదోడు,వాదోడుగా ఉంటాం

## కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్

### ముత్యాలు కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం



**యాచారం శాసనసభ న్యూస్ / నవంబర్ 20 :** మృతి చెందిన చౌదర్పల్లి ముత్యాలు కుటుంబానికి చేదోడు,వాదోడుగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ అన్నారు. యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామానికి చెందిన చౌదర్పల్లి ముత్యలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి దశదినకర్మకు రూ.5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. . ఆపదలో ఉన్నవారు ఎవ్వరూ కూడా అధైర్య పడొద్దని తమ వంతుగా అండగా నిలుస్తామని చెప్పారు. కష్టాల్లో,ఆపదలో ఉన్నవారికి తమ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. గ్రామంలోని పేదలకు ఆపదలో కష్టాల్లో చేదోడు,వాదోడుగా ఉంటానని చెప్పారు. తమకు అందించిన ఈ సాయం ఆ కుటుంబానికి బాసటగా నిలుస్తుందన్నారు. కడు పేదరికంలో పుట్టిన కుటుంబాలను మానవతావాధులు ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మృతుని కుటుంబాన్ని మానవతా దృక్పథంతో ఎవరైనా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కప్పాటి యాదయ్య, రావుల నరసింహ, చెల్లి మల్ల బాలకృష్ణ, తెలకపల్లి రాజు, ఐతరాజు సత్యనారాయణ, రావుల రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి



**చింతపల్లి/ శాసనసభ న్యూస్ ప్రతినిధి / నవంబర్ 20 :** చింతపల్లి మండల కేంద్రంలోని సాయి సుమంగళి గార్డేన్స్ లో జరిగిన నసర్లపల్లి గ్రామ రేషన్ డీలర్ పంబాల వెంకటయ్య కూతురు తేజస్విని, కుమారులు రిష్ కుమార్,లవన్ కుమార్ నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి హాజరై చిరంజీవులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు దండేటికార్ ప్రసాద్,మేకల వెంకటయ్య, నసర్లపల్లి గ్రామ చెందిన చెట్టిమల్లి మల్లికార్జున్,జంగిటి కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం వికటించి 25 మంది విద్యార్థులు అస్వస్థత




**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** నారాయణపేట్ జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తుండగా విద్యార్థులు ఒక్కసారిగా వాంతులు చేసుకొని అస్వస్థతకు గురయ్యారు. ఇది గమనించిన పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులను స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారిలో కొంత మందికి ప్రాథమిక చికిత్స అందించి వారి ఇళ్లకు పంపించారు. 9 మంది విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మరికొంత మందికి పాఠశాల వద్దే వైద్యుడి సమక్షంలో చికిత్స అందిస్తున్నారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన జరిగిన తీరుపై పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# ఇందిర పార్కు లో జరిగే ధర్నాను జయప్రదం చేయండి

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పెరుమండ్ల అంజయ్య



**యాచారం శాసనసభ న్యూస్ / నవంబర్ 20 :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పెరుమండ్ల అంజయ్య ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నవంబర్ 26న ఇందిర పార్కులో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మండల పరిధిలో కుర్మిద్ద గ్రామంలో కరపత్రం తో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది రైతులు ఢిల్లీలో ప్రదర్శన నిర్వహించారు. 13 నెలల పాటు నిరంతరం సాగిన రైతాంగ ఉద్యమం ప్రభావం వల్ల నరేంద్ర మోడీ రైతులకు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వ్యవసా కార్మిక సంఘం నాయకులు ఎం సురేష్ మల్లయ్య, చెన్నయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బావ, బామ్మర్ది ఆత్మీయ సమ్మేళనం



**యాచారం శాసనసభ న్యూస్ / నవంబర్ 20 :** నల్లగొండ జిల్లా, నరసింహ దేవాలయంలో ప్రతి సంవత్సరం బావ బామ్మర్ది లు అందరు కలిసి ఒకచోట చేరి ఘనంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. బావ అంటే అక్క భర్త అని అర్థం. బామ్మర్ది అంటే భార్య యొక్క అన్న లేదా తమ్ముడు అర్థం, కానీ అక్క బావకు ఏ ఆపద వచ్చిన నేను ఉన్నాను అంటూ ఒక భరోసా అని, ఎవరైనా ఒక ఆడపడుచు వివాహం చేసుకోవాలంటే మొదట బామ్మర్దులు ఉన్నారా అని అడుగుతారు. అలసి సొలసి అత్తారింటికి వెళ్ళితే బావ బామ్మర్దిల మర్యాదలు అంతంత కాదు. ఎన్ని కష్టాలు ఉన్న తన బాధలను చెప్పుకుని ఒక వేదిక అత్తారిల్లు, అందుకని ప్రతి సంవత్సరం బావ బామ్మర్దుల సమ్మేళ నిర్వహించడం ద్వారా ప్రేమ ఆప్యాయతలు పంచుకోటమే ఈ కార్యక్రమం ఉద్దేశమని భావించాలి.

# కల్వకుంట్ల గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ





**చండూర్ నవంబర్ 20 (శాసనసభ న్యూస్) :** మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు చెరుకూరి ముత్తమ్మ రూ16500,మేక బాసిరెడ్డి రూ15000 చెక్కులను డిసిసిబి ఉమ్మడి నల్గొండ జిల్లా చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎంపీపీ పోలగోని సత్యం, మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు, గ్రామ శాఖ అధ్యక్షులు బొందు రవి, స్వామి, యాబీష్ రెడ్డి, మల్లేష్, యాదయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే మాదిగలకు హెూం మంత్రి పదవి ఇవ్వాలి

## చేకూరి గణేష్ మాదిగ,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్



**చండూర్ నవంబర్ 20 (శాసనసభ న్యూస్) :** నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేష్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో మాదిగలకు మంత్రివర్గంలో స్థానం లేకుండా ఏ ప్రభుత్వాలు చేయని మోసం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తుంది అందుకే తక్షణమే మాదిగలకు హెూం మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ. అదేవిధంగా ఆగస్టు 01 వ తేదీన సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ మీద ఇచ్చిన తీర్పును ప్రతి రాష్ట్రం అమలు చేయాలని అదేవిధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం జనవరి 26 లోపు ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని , ఈ విద్యా సంవత్సరంలో ఇచ్చిన ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్ లో ఎస్సీ వర్గీకరణను అమలు చేసి ప్రతి మాదిగ బిడ్డకు న్యాయం జరిగే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కమిషన్ తో కాలయాపన చేయకుండా మాదిగలను మోసం చేయాలని చూస్తే వచ్చే స్థానిక పంచాయతీ మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించడానికి పార్టీలకతీతంగా ప్రతి మాదిగ బిడ్డ సిద్ధంగా ఉండాలని అవసరమైతే తెలంగాణలో ప్రతి పార్టీలో ఉన్నటువంటి మాదిగ ప్రజా ప్రతినిధులు, వివిధ పదవులలో ఉన్న ప్రతి కార్యకర్త రాజీనామాలకు కూడా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.లేకపోతే భవిష్యత్తులో రాజకీయంగా కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశానికి ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా సమావేశంలో నల్గొండ జిల్లా కన్వీనర్ నారపాక అంజి మాదిగ , నకిరేకల్ నియోజకవర్గ నాయకులు ఏర్పుల రాకేష్ మాదిగ , నాయకులు బొంగరాల రంజిత్ , మామిడి రాహుల్ , భూతం సాయి కిరణ్ , కటికల కళ్యాణ్ , కటికల రవీందర్ , నవీన్ , పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి పట్టుబడిన ఇద్దరు ఎస్ఎఫ్ఏలు

## కాఫీ షాప్ నిర్వాహకుల నుంచి రూ. 60 వేలు లంచం

**హైదరాబాద్ / శాసనసభ ప్రతినిధి :** జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎస్ఎఫ్ఏలు) లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.జీహెచ్ఎంసీ సర్కిల్ 18 పరిధిలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఎస్ఎఫ్ఏలుగా సలీమ్‌ఖాన్, జీ రమేశ్ పనిచేస్తున్నారు. జూబ్లీహిల్స్ ప్రాంతంలోని ఓ కాఫీషాపు వద్ద చెత్తాచెదారం వేస్తున్నారని, కిచెన్ వ్యర్థాలు ఎక్కువగా వస్తున్నాయంటూ నిర్వాహకులను వేధిస్తున్నారు.ఇటీవల కాఫీషాపు వద్దకు వెళ్లి తాము అడిగిన మొత్తాన్ని ఇవ్వకపోతే షాపును సీజ్ చేయిస్తామని బెదిరించారు. దీంతో షాపు నిర్వాహకులు ఏసీబీని ఆశ్రయించారు. నిర్వాహకుడి నుంచి రూ.60వేలు తీసుకుంటుండగా ఎస్ఎఫ్ఏ రమేశ్‌ను బుధవారం ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్ఎఫ్ఏ సలీం సూచన మేరకే లంచం తీసుకున్నానని చెప్పడంతో, అతడిని కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.అబిడ్స్: హైదరాబాద్ మలక్‌పేట్–2 సర్కిల్‌లో ఇద్దరు వాణిజ్య పన్నులశాఖ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతాను డిఫ్రీజ్ చేయడానికి సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ మహబూబ్‌బాషా రూ.లక్ష



డిమాండ్ చేయగా, అతడు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత ఏసీటీవో సోమశేఖర్‌కు రూ.50 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి, ఇద్దరు అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.నగదును స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు అడిగితే అవినీతి నిరోధకశాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేసి సమాచారం అందించాలని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాల్వాయి గోవర్దన్ రెడ్డి

## జయంతి సందర్భంగా ఘనంగా నివాళి

**చండూర్ నవంబర్ 20 (శాసనసభ న్యూస్) :** చండూర్ మండలం పరిధిలోని ఇడికూడ గ్రామానికి చెందిన పాల్వాయి గోవర్దన్ రెడ్డి 88వ జయంతి సందర్భంగా చండూరు మున్సిపాలిటీ లోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకన్న, పాల్వాయి శ్రవణ్ కుమార్ రెడ్డి, పాల్వాయి శంతన్ కుమార్ రెడ్డి, పన్నాల లింగయ్య, రావిరాల నగేష్, ఇరిగి వెంకటేష్, ఇరిగి శంకర్, ఇడికూడ నరేందర్, రాపోలు వెంకటేశం, కారింగు రామ్మూర్తి, ఐతరాజు మల్లేష్, డీలర్ వెంకటేశం, కల్లెట్ల మారయ్య, కర్నాటి శ్రీను, మహమ్మద్ గని, జావిద్, పంతగి గిరి, చింతకుంట్ల ధత్తయ్య, పాల్వాయి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.





# పోటాపోటీగా పాల్వాయి గోవర్ధన్ రెడ్డి

## జయంతి వేడుకలు

**చండూరు నవంబర్ 20 (శాసనసభ న్యూస్) :** మాజీ మంత్రి, దివంగత రాజ్యసభ సభ్యుడు పాల్వాయి గోవర్ధన్ రెడ్డి జయంతి వేడుకలను బుధవారం చండూరు మండల కేంద్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. చండూరు చౌరస్తాలోని ఆయన విగ్రహానికి మొదట ఆయన కుమారులు పాల్వాయి శ్రవణ్ కుమార్ రెడ్డి, పాల్వాయి శంతన్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. అనంతరం పాల్వాయి గోవర్ధన్ రెడ్డి కూతురు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వేసిన పూలదండలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు తొలగించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు అభ్యంతరం తెలుపగా ఇరుపార్టీ నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. కాగా పాల్వాయి కుటుంబంలో గత కొంతకాలంగా ఆస్తి తగాదాలు నెలకొన్న నేపథ్యంలో కుటుంబ సభ్యులు వేరువేరుగా నివాళులు అర్పించడం సర్వత్ర చర్చనీయాంశం అయినది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత – వెంకటేష్ యాదవ్ మహమ్మద్ గని, కల్లెట్ల మారయ్య, పన్నాల లింగయ్య, కారింగు రామ్మూర్తి, బోయపల్లి స్వామి, ఇరిగి మారయ్య, పంతంగి గిరి, నల్ల స్వామి,



బిఆర్ఎస్ నాయకులు మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళ – వెంకన్న, పట్టణ అధ్యక్షుడు సతీష్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తేలుకుంట్ల చంద్రశేఖర్, జానయ్య, సుదర్శన్, పాల్వాయి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శాంతి భద్రతల సంరక్షణలో దేశానికే

## ఆదర్శవంతంగా తెలంగాణ : డిజిపి జితేందర్

**హైదరాబాద్ / శాసనసభ ప్రతినిధి :** తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శమని రాష్ట్ర డిజిపి జితేందర్ తెలియజేశారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎస్పీ



కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ గా ప్రారంభించగా డిజిపి రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నూతన కార్యాలయ సేవలు ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి వచ్చాయన్నారు. శాంతి భద్రతల సంరక్షణలో దేశానికే ఆదర్శవంతంగా తెలంగాణ పోలీసింగ్ నిలుస్తుందని, సాంకేతికత దన్నుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందంజలో ఉ ఒన్నారు.పోలీసు వ్యవస్థలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ మెరుగైన భద్రత వ్యవస్థను రాష్ట్రంలో నెలకొల్పడం జరుగుతుం దని, రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడే అంశంలో వ్యక్తులు శాశ్వతం కాదని, వ్యవస్థలు మాత్రం శాశ్వతం గా నిలిచిపోతాయన్నారు.

# జిల్లా అభివృద్ధికి శ్రీకారం



- యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టుల పనులు
- నేతన్నలకు ఉపాధి
- స్వశక్తి సంఘాల మహిళలకు కోటి 30 లక్షల చీరలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వేములవాడలో ప్రజాపాలన విజయోత్సవ సభ
- రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి :** రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధి కార్యాక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్‌లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, నేత కార్మికులకు ఉపాధి కల్పించడానికి స్వశక్తి సంఘాల మహిళలకు చీరలు అందించనున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ గుడి చెరువు మైదానంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సిరిసిల్లలో అన్ని పనులు చేయాలని అనుకున్నా.. అంతా సవ్యంగా జరిగినా తప్పిదం జరిగిందని, కేకే మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే కాలేదని అన్నారు. అయినా సిరిసిల్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని, సిరిసిల్ల ప్రాంతంలోని మెడికల్ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని అన్నారు. గతంలో వేములవాడ ఎమ్మెల్యేగా మూడు సార్లు ఎన్నుకున్నా ఆయనను కలవడానికి జర్మనీకి పోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆది శ్రీనివాస్ దగ్గరకు పోవాల్సిన పనిలేదని, ఆయనే మీ వద్దకు వస్తున్నారని అన్నారు. పట్నం వస్తే కాగితాలతోనే వస్తారని, ఆయనను చూస్తే మళ్లీ ఏం అడుగుతాడోనని భయం వేస్తుందని అన్నారు. పైరవీలు, కాంట్రాక్ట్‌ల కోసం రారని, తనను అక్కున చేర్చుకున్న వేములవాడ ప్రాంత అభివృద్ధినే అడుగుతారని అన్నారు. రెండు దశాబ్దాల నుంచి ఉన్న మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలని, నిర్వాసితులు వంటావార్పు, నిరసన కార్యక్రమాలకు తనను ఆహ్వానించడం ద్వారా ఆనాడు సమస్యను తన దృష్టికి తీసుకవచ్చారని అన్నారు. అవకాశం వచ్చినపుడు సమస్యను పరిష్కరిస్తామని మాట ఇచ్చానన్నారు. అదే విధంగా పాదయాత్రకు వచ్చిన సందర్భంలో కలికోట సూరమ్మ ప్రాజెక్ట్ మొత్తం కలియతిరిగి ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని చెప్పానని, పాదయాత్రలో అభివృద్ధి స్థితిగతులు తెలుసుకున్నానని అన్నారు. కరీంనగర్ గడ్డకు పరిపాలన చాతుర్యమే కాదు పోరాటాల పౌరుషం ఉందని పాదయాత్రలో తెలుసుకున్నట్లు చెప్పారు. కరీంనగర్ జిల్లా గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదని, దేశానికి దశ, దిశ నిర్దేశం చేసిన పీవీ నరసింహారావు గ్రామస్థాయి నుంచి ఢిల్లీ వరకు నాయకత్వం వహించారని, పరిపాలన అంటే ఇలా ఉండాలని చూపించారని అన్నారు. తెలంగాణ బిడ్డ పరిపాలన చేస్తే ప్రపంచమే అబ్బురపడే విధంగా అభివృద్ధి పథం వైపు నడుస్తుందని కరీంనగర్ బిడ్డ పీవీ నరసింహారావు చూపారన్నారు. రైతాంగానికి సమస్యలు వచ్చినా, నిరుద్యోగ యువతకు బాధ కలిగినా కరీంనగర్ జిల్లా నుంచే ఉద్యమాలు మొదలవుతాయని, కరీంనగర్ జిల్లా నాయకత్వం వహించిందని అన్నారు. సిరిసిల్ల, జగిత్యాల రైతాంగ పోరాటాలు రాష్ట్ర ప్రజలు ఎప్పుడూ మర్చిపోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం కల నెరవేరాలని ఈప్రాంతంలో లేచిన ఉవ్వెత్తు ఉద్యమమని, సోనియాగాంధీ కరీంనగర్ గడ్డమీద నుంచి మాట ఇచ్చారని తెలంగాణ అకాంక్షను నెరవేర్చారని అన్నారు. పార్లమెంట్‌లో ఎంపీగా పొన్నం ప్రభాకర్ పెప్పర్ స్ప్రేలో, జైపాల్‌రెడ్డి ఎంపీల వీరోచిత పోరాటంతోనే తెలంగాణ బిల్లు ఆమోదమైందన్నారు. తెలంగాణ బిల్లు ఆమోదం ఆషామాషీగా జరగలేదని, అల్లాటప్పాగా ఎవరూ తెలపలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 155 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాలతోపాటు పార్టీ శాశ్వతంగా నష్టపోతుందని తెలిసినా సోనియాగాంధీ తెలంగాణ ప్రజల కోరికను నెరవేర్చారన్నారు.

### మాట ఇస్తే ఎంత దూరమైనా పోతాం

కాంగ్రెస్ పార్టీ ఏదైనా మాటిస్తే ఎంతదూరమైనా పోతామని, ప్రజల ఆకాంక్షలు నెరవేరడానికి ఎంత త్యాగానికైనా సిద్ధ పడుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంపీగా ఒకసారి పొన్నం గెలిస్తేనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, బండి సంజయ్ రెండు సార్లు పార్లమెంట్‌కు పంపిస్తే మంత్రి అయ్యాడని, కరీంనగర్‌కు నరేంద్రమోదీ నుంచి చిల్లిగవ్వ అయినా తెచ్చాడా? అని ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధి కోసం పార్లమెంట్‌లో ఎప్పుడైనా మాట్లాడాడా? అన్నారు. అంతకుముందు మూడు సార్లు బీఆర్ఎస్‌ను గెలిపించారని, వాళ్లు కూడా గుండుసున్నా ఇచ్చారని అన్నారు. రాజన్న కోరికలు తీర్చే దేవుడని, రాజన్న మందిరం పది సంవత్సరాలుగా పడావుగా ఎందుకు పడిందని ప్రశ్నించారు. దాదాపు పది సంవత్సరాలు కేసీఆర్ రూ.80 లక్షల కోట్ల బడ్జెట్ ఖర్చు పెట్టాడని, తెలంగాణ రాష్ట్రాన్ని రూ.7 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచాడని అన్నారు. రూ.100 కోట్లతో రాజన్న దేవాలయాన్ని అభివృద్ధి చేయలేకపోయిండని, కాళేశ్వరం ప్యాకేజీ 9 ఎందుకు పడావు పడిందని, కలికోట సూరమ్మ ప్రాజెక్ట్ ఎందుకు పూర్తి కాలేదని అన్నారు. కొండగట్టు హనుమంతుడి ఆశీర్వాదం తీసుకొని శ్రీరాంసాగర్ నుంచి మొదలుకొని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వరకు కాంగ్రెస్ కట్టినవేనని, మిగిలిన వాటిని కూడా పూర్తి చేస్తామని చెప్పామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అసంపూర్తిగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్ట్, అందులో ఉ ఒడే సిరిసిల్లలోని ప్యాకేజీ 9, వివిధ ప్రాంతాల్లో వాయిదాలు పడుతున్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని అన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దీనిపై సమీక్ష నిర్వహిస్తారని, కరీంనగర్‌లో సాగునీటి ప్రాజెక్ట్‌లపై సమీక్ష నిర్వహించి ఎన్ని నిధులు కావాలి, ఎంత కాలంలో పూర్తయితాయి అనే దానిపై ఎమ్మెల్యేల సలహాలు తీసుకుంటారని అన్నారు.

### నేత కార్మికులకు ఉపాధి

నేత కార్మికులకు ఉపాధి, పని కల్పించడానికి 65 లక్షల మంది స్వశక్తి సంఘాల్లోని మహిళలకు రెండు చీరల చొప్పున కోటి 30 లక్షల చీరలు పంపిణీ చేయడానికి నిర్ణయించామని రేవంత్‌రెడ్డి అన్నారు. పవర్‌లూమ్‌లపై నేసే పాలిస్టర్‌తోపాటు కాటన్ కలిపి డిజైన్లు రూపొందించాలని మహిళలకు అత్మగౌరవంతో ఉండే విధంగా చీరలు తయారు చేయాలని అన్నారు. సిరిసిల్లలో నేత కార్మికుల కోసం యారన్ డిపోను వేములవాడలో ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న నేతన్నలు, గీతన్నలు, గల్ఫ్ కార్మికులకు ఆదుకోవడానికి బోర్డును ఏర్పాటు చేయడంతోపాటు గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు చెప్పారు.

### కేసీఆర్ కొడుకు, అల్లుడివి చిల్లర మాటలు

కేసీఆర్ కొడుకు, అల్లుడివి చిల్లర మాటలని, అధికారం పోయినా బుద్ధి మారలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం పోయిందని, పార్లమెంట్‌లో సీట్లు పోయాయని, ఇప్పుడు వాళ్ల వేషాలు చూస్తుంటే ఉన్న మెదడు దొబ్బినట్లు అనిపిస్తోందంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులపై ధ్వజమెత్తారు. పది సంవత్సరాలు కేసీఆర్ చేయలేని పనుల్లో పడావు పెట్టిన ప్రాజెక్ట్‌లు తిరిగి పున: ప్రారంభిస్తూ ప్రభుత్వం ముందుకు పోతోందని, కేసీఆర్ ఫాంహౌస్‌లో పడుకుంటే, కేటీఆర్, హరీష్‌రావు మన కాళ్లల్లో కట్టె పెట్టడానికి తిరుగుతున్నారని విమర్శించారు. పది సంవత్సరాల్లో చేసి ఉంటే 25 రోజుల్లో 23 లక్షల రైతు కుటుంబాలకు రూ.18 వేల కోట్లు రుణ మాఫీ చేసే అవసరం తనకు వస్తుండేదా? అన్నారు. పదేళ్లలో లక్ష రూపాయల రుణమాఫీ నాలుగు విడతలుగా చేశారని, అసలు, మిత్తీ కలిపి రైతులకు తడిసి మోపెడు అయ్యిందని అన్నారు. దేశంలో రైతుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంటే తెలంగాణ రెండో స్థానంలో ఉన్న విషయం కేసీఆర్ మర్చిపోయినట్లు ఉన్నారని అన్నారు. పదేళ్లలో రూ.11 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేశారని, ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం 25 రోజుల్లో 2 లక్షల రుణమాఫీకి రూ.18 వేల కోట్లు చేస్తే పెద్ద మనిషిగా అభినందించాల్సింది తండ్రి, కొడుకు, అల్లుడు అన్నీ చిల్లర మాటలే మాట్లాడుతున్నారని అన్నారు. అక్కరకు వచ్చే మాటలు లేవన్నారు. పదేళ్లు పరిపాలించారని, పది నెలలు కాకముందే దిగిపో అంటున్నారని, పదేళ్లు ఏం వెలగబెట్టారో చెప్పాలని అన్నారు. వాళ్లు చేయలేని పనులు తాము చేస్తుంటే నొప్పి ఎందుకన్నారు. వాళ్ల నొప్పికి తమ కార్యకర్తల దగ్గర మందు ఉందని, నొప్పి లేచిన కాడా మందు పెడతారని అన్నారు. సోషల్ మీడియాలో నాలుగు హౌలా పోస్టులు పెడితే మొనగాళ్లు అనకుంటున్నారా? అని ధ్వజమెత్తారు. అధికారం వచ్చిందని తమ కార్యకర్తలు కాస్తా రిలాక్స్‌గా ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బావ, బామ్మర్ధుల పని చెప్పారని అన్నారు. పదేళ్లలో రుణమాఫీ లెక్క తీద్దామని, 25 రోజుల్లో తాము చేసిన రుణమాఫీ లెక్కలు తీద్దామని వాస్తవాలు మాట్లాడుకుందామని అన్నారు. కేసీఆర్‌కు ధైర్యం, నిజాన్ని ఎదుర్కొనే చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. నిరుద్యోగ సమస్యతోనే తెలంగాణ సాధించుకున్నామని అన్నారు. ఆత్మ బలిదానాలుచేసి సాధించుకన్న తెలంగాణలో పది నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. కేసీఆర్ పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో లెక్క చెప్పాలని, ఎల్బీ స్టేడియంకు వస్తే 50 వేలకు తక్కువ కాకుండా ఒక్క తల తక్కువ వచ్చినా క్షమాపణ చెబుతానని అన్నారు. కేటీఆర్‌ను ఉద్దేశించి అన్ని చిల్లర మాటలేనని, ‘మా తాత ఉన్నప్పుడే నోటిఫికేషన్ ఇచ్చాడు. మా తాతలు నేతులు తాగితే మూతులు నాకండి’ అన్నట్లు... ‘చచ్చిపోయిన బర్రె కుండ నిండా పాలు ఇచ్చేది’ అని అంటున్నారని ‘బర్రె సచ్చింది. కుండ పోయింది. బుద్ధి మాత్రం మారడం లేదు’ అని అన్నారు. రైతు రుణమాఫీ, నిరుద్యోగుల సమస్యలతోపాటు ఆడపడుచులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. 11 నెలల్లోనే 1.10 కోట్ల మంది ఆడబిడ్డల బస్సు ప్రయాణానికి రూ.3700 కోట్లు ఖర్చు పెట్టామని మోదీ ప్రభుత్వం సిలిండర్ ధర రూ.1200 చేస్తే రూ.500కే సిలిండర్ ఇస్తున్నామని అన్నారు. కేసీఆర్ వరి వేస్తే ఉరి వేసుకున్నట్లేనని అన్నారని, ఆయన ఫాంహౌస్‌లో 150 ఎకరాల్లో వరి వేశారని అన్నారు. ప్రభుత్వం వరి పండాల్సిందేనని, సన్నవడ్లకు రూ.500 బోనస్ ప్రకటిస్తే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ గడ్డపై 66 లక్షల ఎకరాల్లో కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు పండించారని అన్నారు. గతంలో వడ్లు పండితే కాళేశ్వరం నీళ్లు తెచ్చానని కేసీఆర్ అన్నారని, ఆ దిక్కుమాలినోడు కట్టిన కాళేశ్వరం, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, కుప్పకూలాయని అన్నారు. పనిమంతుడు పందిరేస్తే కుక్క తోక తగిలి కూలిపోయిందట అన్నారు. కాళేశ్వరం కట్టింది ఎప్పుడో కూలింది ఎప్పుడని ప్రశ్నించారు. లక్ష కోట్లు నిండా మింగి ఫాంహౌస్‌లో పడుకున్నారన్నారు. కాళేశ్వరం నుంచి చుక్కనీళ్లు లిఫ్ట్ చేయకుండానే కాంగ్రెస్ కట్టిన శ్రీరాంసాగర్, శ్రీపాద, వరంగల్, నిజామాబాద్‌లోని ప్రాజెక్ట్‌ల ద్వారా కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండాయన్నారు. లక్ష కోట్లు కాళేశ్వరంలో కాంట్రాక్టర్‌లకు కాలబెట్టాడన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో 20 కోట్లు పెట్టినా చుక్క నీరు రాలేదన్నారు. కేసీఆర్ పదేళ్లలో లక్ష 83 వేల కోట్ల ప్రజాధనం ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల మీద పెట్టినా పూర్తి కాలేదన్నారు. తెలంగాణ ప్రజలకు ఒక్క ప్రాజెక్ట్ అయినా అంకితం చేశారా? అని ప్రశ్నించారు. మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్ట్‌లు కట్టారని రంగనాయక సాగర్ కడితే హరీష్‌రావు ఫాంహౌస్ కట్టుకున్నాడని, ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ చేసిన భూములను హరీష్‌రావు బదిలీ చేయించుకున్నారని అన్నారు. హరీష్‌రావు ఫాంహౌస్ లెక్క చెప్పాల్సిందేనని, లెక్క తీస్తున్నానని అన్నారు. కొండ పోచమ్మ ప్రాజెక్ట్ కేసీఆర్ ఫాహౌస్‌కు కాలువలు తీసుకపోవడానికే కట్టారన్నారు. నిజ నిర్ధారణ కమిటీ వేసుకొని కొండ పోచమ్మ ప్రాజెక్ట్‌కు పోదామన్నారు. వేల కోట్లు ప్రజల సొమ్ము ఖర్చు చేసి ఫాంహౌస్‌కు నీళ్లు తీసుకవెళ్లడం కేసీఆర్‌కు న్యాయమా? అని ప్రశ్నించారు. కొడంగల్‌లో 75 ఏళ్లుగా వెనకబడిపోయిందని, ఎవరికి కూడా మంత్రిగా అవకాశం రాలేదని అన్నారు. ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చిందని కొడంగల్ అభివృద్ధి చేయాలని ఎడారిగా మారినా గ్రామాలకు నీళ్లు ఇవ్వడానికి నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకానికి తొండలు కూడా గుడ్లు పెట్టని భూమిని సేకరిస్తే హరీష్ కాళ్లలో కట్టె పెడతున్నాడన్నారు. కొడంగల్‌లో పరిశ్రమ వస్తే నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. పరిశ్రమలు రావాలంటే భూ సేకరణ లేకుండా జరుగుతుందా? కనీస పరిజ్ఞానం కేసీఆర్‌కు లేదా? అన్నారు. ఉద్యమకారుడు, 80 వేల పుస్తకాలు చదివినా అని చెప్పుకునే కేసీఆర్ కొడంగల్ నియోజకవర్గంపై ఎందకు కక్ష కట్టావని ప్రశ్నించారు. పరిశ్రమలు స్థాపించడానికి భూ సేకరణ చేస్తే రౌడీ మూకలతో కలెక్టర్, అ౽ధికారులపై దాడులు చేస్తున్నారని, భూ సేకరణ చేయకుండా పరిశ్రమలు ఎలా వస్తాయని అన్నారు. ఎవరో ఒకరు భూమి కోల్పోవాల్సిందేనని, వారికి పరిహారం మూడింతలు ఇచ్చే విధంగా చట్టాన్ని తీసుకొచ్చామని అన్నారు. రైతులు కూడా స్వచ్ఛందంగా భూములు ఇవ్వడానికి ముందుకొస్తారని అన్నారు. ఎవరైనా భూమిని తల్లిదండ్రులతో సమానంగా చూసుకుంటారని అందుకే నూతన వి౽ధానం తీసుకొచ్చామని అన్నారు. కేటీఆర్ ఫిర్యాదు చేయడానికి ఢిల్లీ వెళ్లాడని, రేపు చంద్రమండలం వెళ్లినా మళ్లీ ఇక్కడికే రావాల్సిందేనని కుట్రలు ఎన్ని చేసినా లెక్క తీస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదరం రాజనర్సింహా, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్, విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్మన్ నేరేళ్ల శారద, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, వివిధ శాఖల కార్యదర్శులు డైరెక్టర్లు పాల్గొన్నారు.